# అబ్బాయి ఉత్తరం



కథా నిలయం
శ్రీకాకుళం

జొన్నలగడ్డ రామలక్ష్మి

రామకృష్ణకు చిన్నప్పట్నుంచీ కొడుకులంటే ప్రాణం అతనికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు రవి. రెండోవాడు రాజా. ఇద్దరిలోకీ రవికి తండ్రి దగ్గర చేరిక ఎక్కువ.

రవి చిన్నప్పట్నుంచీ బుద్ధిగా చదువుకుని ఇంటర్మీడియేట్ ఫస్టు క్లాసులో పాసయ్యాడు.

ఉద్యోగరీత్యా రాజమండ్రిలో ఉంటున్న రామకృష్ణకు కొడుకును ఇంజనీరింగ్ చదివించాలని ఉంది. అందుకని ఎక్కడెక్కడి కాలేజీ లకూ అప్లై చేశాడు. రవికి రూర్కేలా ఇంజనీరింగ్ కళా శాలలో సీటు వచ్చింది. కాకినాడలో గానీ, వాల్తేర్లో గానీ వస్తే బాగుండు నని అతననుకున్నాడు గానీ అలా జరగలేదు.

రామకృష్ణ — రవిని రూర్కేలా తీసుకువెళ్ళి స్వయంగా హాస్టల్లో దిగవిడిచి- ఓ ఉత్తరాల కట్ట ఇచ్చి, "ప్రతి శనివారం నాకూ నీ క్షేమ సమాచారాలు తెలుపుతూ ఉత్తరం రాసి పోస్టు చేయాలి. అడ్రసులు కూడా నేనే రాసి ఉంచాను" అని చెప్పాడు. రవికి అతనింకా చాలా జాగ్రత్తలు చెప్పాడు. తోటి వారిలో ఎలా వుండాలో, హాస్టల్లో ఎలా మసులుకోవాలో, పదిమందినీ ఎలా మంచిచేసుకోవాలో అతడు వివ రించి కొడుక్కు చెప్పాడు. కొత్తగా అత్తింట్లో కూతుర్ని దిగ విడిచిన తండ్రిలా అతను కలవర పడిపోతూ కన్నీళ్ళొత్తుకుంటూ కొడుక్కు జాగ్రత్తలు చెప్పాడు. తల ఊపుతూన్న రవి కళ్ళలో- రానున్న ఒంటరితనం గురించిన భయం ఛాయలు కనపడుతున్నాయి. వదలలేక వదలలేక కొడుకును వదిలిపెట్టాడు రామకృష్ణ.

తిరిగి వచ్చేక రామకృష్ణ మొదటిపని ఉత్తరాల గురించి ఎదురు చూడటం. మూడు ఉత్త రాలు అనుకున్న ప్రకారమే వచ్చేయి కాని, తర్వాత ఉత్తరాలు ఆగిపోయాయి. రామకృష్ణ కంగారు పడి ఉత్తరం రాసినా జవాబు వచ్చేది కాదు. అతను మాత్రం పోస్టుమాన్ వచ్చినప్పుడల్లా 'ఉత్తరముందా?' అని అడిగేవాడు. అతని కళ్ళలో ఆత్రుత। పోస్టు మాన్ లేదనేస్తాడేమోనన్న భయం।

తండ్రికి ఉత్తరం రాయకూడ దని రవి అనుకోలేదు. అత నిప్పుడు కొత్త జీవితానికి అలవాటు పడుతున్నాడు. కొత్త స్నేహితు లలో మసలుతున్నాడు. ఈ జీవితం కొత్తగా ఉంది. బాగుంది. తల్లి దండ్రులపైన అతనికి అపేక్ష ఉంది. వారి యోగక్షేమాలపట్ల ఆసక్తి ఉంది. కానీ ఆట్టే ఆసక్తి కలిగిం చని విశేషాలను ఉత్తరంగా చదవ డమూ, వ్రాయడమూ కూడా అతనికి చిరాగ్గానే ఉంటుంది. ఆ వయసు అటువంటిది. ఆ వాతా వరణం అటువంటిది.

తండ్రి ఉత్తరం చూసినప్పు డల్లా జవాబివ్వాలనే అనుకుంటూండే

వాడు రవి. సాయంత్రం రాద్దామని ఉదయమూ, ఉదయం రాద్దామని సాయంత్రమూ అనుకుంటూ వాయిదాలు పడిపోతూంటే తండ్రి దగ్గర్నుంచి మరికొన్ని ఉత్తరాలొస్తూండేవి. అందులోని యోగ క్షేమాలు, మందలింపులు అతనికి నిరాసక్తంగా, యధాలాపంగా ఉండేవి. అతనికి క్షణాల్లా గడిచి పోతున్న యుగాలు, తండ్రికి యుగాల్లా గడుస్తున్న క్షణాలు!

నెల రోజులో, ఆరువారాలో ఎదురు చూడగా ఒక ఉత్తరం! కొన్ని పదులసార్లు పోస్టుమాన్ కేసి ఆశగా చూస్తూంటే ఒకసారి చూపు ఫలిస్తోంది. ఈలోగా కొడుకు క్షేమయిందో- అక్కడేం జరిగిందో నని ఆ తండ్రి ప్రాణం గిలగిల్లాడి పోయేది. సాధారణంగా ఇలాంటి విషయాల్లో మగవాళ్ళు ఆడవాళ్ళకు ధైర్యం చెప్పాలి రామకృష్ణ భార్యకు ధైర్యం చెప్పేవాళ్ళు లేక ఆమె మరంత దిగులు పడిపోయేది. వీళ్ళిద్దర్నీ చూసి రాజా బెంగపెట్టు కునే వాడు.

కొడుకు పద్ధతి నచ్చక- మొదటి పర్యాయం రవి ఇంటికి సెలవుల్లో వచ్చినపుడు- రామకృష్ణ బాగా మందలించాడు. తాము ఎంతగా కంగారు పడిపోతున్నారో వివరించి—"ఒక్కటంటే ఒక్క కార్డు- క్షేమంగా ఉన్నానని రాసి పారేయడానికి నీకు కష్టమేముంది? నువ్వలా ఎందుకు చేయడం లేదు?" అని అడిగాడు.

"విశేషాలేమీ లేనప్పుడు ఉత్తరాలేమని రాసేది? అదీకాక అక్కడ నా కొక్క క్షణం కూడా తీరుబడి దొరకడం లేదు. ప్రాక్టికల్స్ ఎక్కువగా ఉంటున్నాయి. మర్నాడు క్లాసుకు బోలెడు ప్రిపేర్ అవ్వాలి. ఓ క్షణం తీరుబడి దొరికితే నలుగురూ చుట్టూ చేరతారు. ఉత్తరం వ్రాయాలంటే నవ్వుతారు. తర్వాత రాయొచ్చులే అంటారు. మీ దగ్గర్నుంచి అస్తమానం ఉత్తరాలొస్తున్నాయని, నన్ను కొందరు చిట్టి పాపాయని ఏడిపిస్తున్నారు కూడా" అని రవి ఓ క్షణం ఆగి- "అయినా మీరు కంగారుపడ్డం అనవసరం. నా దగ్గర్నుంచి ఉత్తరం రాకపోతే ఏ కంగారూ లేదన్నమాటే! ఏదైనా ముఖ్య విశేషాలుంటే ఎలాగూ తెలియ బరుస్తాను" అన్నాడు.

"నువ్వలాగనడానికి వీల్లేదు. వారానికో ఉత్తరం చొప్పున రాసి తీరాల్సిందే" అన్నాడు రామకృష్ణ.

అలాగేనన్నాడు రవి. కాని అతను ఉత్తరాల ప్రాముఖ్యత

నంతగా గుర్తించలేదనీ, ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదనీ తెలుస్తూనే ఉంది. అతను తిరిగి రూర్కెలా వెళ్ళినప్పుడు తండ్రి మరీ మరీ ఉత్తరాల విషయం చెప్పాడు.

రవి ఉత్తరాలు తన పద్ధతిలోనే రాస్తున్నాడు. రామకృష్ణ ఆ విషయంలో అతన్ని మందలిస్తూ వారానికో ఉత్తరం చొప్పున రాస్తున్నాడు.

ఈ పద్ధతి రవికి నచ్చలేదు. అతను తన స్నేహితుడు గౌరీశంకర్‌కు ఈ సమస్య చెప్పి, "మా నాన్నకు ఉత్తరం రాయాలని నాకూ ఉంటుంది. కానీ అనుకోకుండా అశ్రద్ధ అయిపోతూంటుంది. అయినా వారం వారం ఉత్తరాలు రాసేటంత విశేషాలేముంటాయి, పెద్దవాళ్ళ చాదస్తం కాకపోతే? మా నాన్న చాదస్తం పోగొట్టే ఉపాయమేదైనా లేదా?" అన్నాడు.

గౌరీశంకర్ ముందు రవి తండ్రిని మెచ్చుకుని, "మా నాన్నయితే నేనిల్లు వదిలిపెట్టిపోవడమే చాలనుకుంటున్నాడు. తనుత్తరం రాయడు. నన్ను రాయమనడు. పైగా కవర్లకు డబ్బు వృధా చేయొద్దంటాడు" అన్నాడు. తర్వాత, "నీదీ ఒక ఇబ్బందే! కుర్రాళ్ళకు లక్ష వ్యవహారాలుంటాయి. పెళ్ళయిన వాళ్ళలా రోజూ ఉత్తరాలు రాసుకోడానికిదేం ప్రేమ వ్యవహారం కాదు గదా! రాయడానికి కూడా బోరుగా ఉంటుంది" అన్నాడు. చాలాసేపు ఆలోచించి- "ఓ పని చేస్తే సరి! పదిరోజులకోసారి పదో పాతికో కావాలని ఇంటికి ఉత్తరం రాయి. అనుకోని ఖర్చులున్నాయనీ, ఏవో అవసరాలున్నాయనీ-వ్రాయడానికి సిగ్గుగా ఉందనీ వ్రాస్తూండు" అన్నాడు.

రవి ఈ సూచనను మెచ్చుకొని, "బాగానే ఉంది కానీ-మా నాన్న నిజంగా డబ్బు పంపించేస్తే అప్పుడేం చేయాలి?" అన్నాడు.

"డబ్బుంటూ ఉండాలి కానీ ఖర్చుకు మార్గంలేదా?" అన్నాడు గౌరీశంకర్.

కొడుకు దగ్గర్నుంచి మొదటి ఉత్తరం అందుకుని పది అని రాస్తే పదిహేను రూపాయలు పంపి— 'డబ్బుకిబ్బంది పడకు. అందుకని ఉత్తరాలు రాయడం మానకు....' అని రాశాడు రామకృష్ణ.

ఆ డబ్బుతో స్నేహితులతో సినిమాకు వెళ్ళాడు రవి.

కొడుకు దగ్గర్నుంచి రెండో ఉత్తరం రాగానే అందులో రాసిన

ప్రకారం పదిహేను రూపాయలూ పంపిస్తూ— 'ఉత్తరాలు రాయడం మానకు' అంటూ రాశాడు రామకృష్ణ.

ఆ డబ్బుందన్న ధైర్యంతో రవి స్నేహితులతో డబ్బుపెట్టి పేకాడేడు. అంతా పోగా ఓ ఐదు రూపాయలు బాకీపడ్డాడు. ఒకోసారి అంతకు అంతా రాబట్టుకోవచ్చునని ధైర్యం చెప్తూ రవికి ఉత్సాహం కలుగజేశాడు గౌరీశంకర్.

కొడుకు దగ్గర్నుంచి మూడో ఉత్తరం రాగానే అందులో రాసిన ప్రకారం పదిహేను రూపాయలూ పంపిస్తూ—'డబ్బు జాగ్రత్తగా పొదుపుగా వాడుకో'— అని మాత్రం రాశాడు రామకృష్ణ కొడుక్కి.

ఆ డబ్బుతో మొదటిసారిగా సిగరెట్ పెట్టికొని ఆ సందర్భంగా స్నేహితుల్లో ముఖ్యులైన ముగ్గురికి బీర్ పార్టీకూడా ఇచ్చాడు రవి. ఇప్పుడు రవి తండ్రికి వుత్తరాలు వ్రాయటం ఎక్కువ చేశాడు.

ఇప్పుడు రామకృష్ణ కొడుకు ఉత్తరాల కోసం ఎదురు చూడడం లేదు. పోస్టుమాన్ తనను సమీపిస్తుంటే కొడుకు దగ్గర్నుంచి ఉత్తరం వస్తోందేమోనని ఉలిక్కిపడుతున్నాడు. కొడుక్కుత్తరాలు రాయడం కూడా తగ్గించేశాడు. రాసినా కొడుకు ఆరోగ్యం గురించి-డబ్బు జాగ్రత్త గురించి రాస్తున్నాడు.

నిజానికి రవి సమస్య తొలగిపోయినట్లే! అయితే అతనికిప్పుడు తండ్రి మామూలుగా పంపే డబ్బు చాలడంలేదు. అందుగురించి తప్పనిసరిగా తండ్రికి ఉత్తరాలు రాయాల్సి వస్తోంది.

రామకృష్ణ లక్షాధికారి కాడు. మామూలు ఉద్యోగి. అందువల్ల కొడుకు డబ్బు గురించి ఉత్తరం రాసినప్పుడల్లా అతను డబ్బు పంపలేదు. అతను పోస్టుచేయగలిగిందల్లా కేవలం నీతి బోధలు మాత్రమే!

రవి చెడిపోలేదు. అతను బుద్ధిగానే చదువుకుంటున్నాడు. కానీ కొత్త అలవాట్లు—కొత్త ఖర్చులు తెచ్చిపెడుతున్నాయి. తండ్రి ఉత్తరాలను చదివి పరిస్థితులర్థంచేసుకునే మనస్థితి అతనికి లేదు. అందువల్లనే పోస్టుమాన్ ఎప్పుడైనా ఉత్తరం తెచ్చియిస్తే— అది రవి దగ్గర్నుంచి కాకపోతే— 'అమ్మయ్య!' అనుకుంటున్నాడు రామకృష్ణ. *